

# అనగనగా ఓ మంచి కథ

## అశ్వహృదయం

- శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

(ఆంధ్రపత్రిక మే 15, 1940 సంచిక నుంచి)



శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

శ్రీ శ్రీ శ్రీ వత్ససాయి చతుర్భుజ తిమ్మ జగపతి మహారాజుకి ఉదయం గరిడి సాములూ, సాయంకాలం పంచకల్యాణి ఎక్కి షికారు వెళ్ళడమూ తప్పని నిత్యకృత్యాలు.

ఎప్పుడైనా ప్రళయం వంటి ఆ సందర్భము తటస్థించి గరిడి సాములు మానెయ్యడం, జరిగితే జరగవచ్చు. కాని గుర్రపు స్వారీ మాత్రం కట్టిపెట్టడానికి వీలు లేదు.

అలా జరగనినాడు ఆ పంచకల్యాణి నానా హంగామా చేసేస్తుంది.

కోట అంతా గగ్గోలు పరిచేస్తుంది.

ఒకనాడేం జరిగిందంటే?

ఆవేళ సాయంత్రం దీపాలు పెట్టగానే సంగీత కచేరీ ప్రారంభం కావలసి ఉంది.

అయితే నెల్లూరినుంచీ ఒక గజ ఆటగాడు వచ్చి ఉండగా, అప్పటికి తేల్చుకోలేకపోతామా అని మహారాజు జామున్నర పొద్దువేళ చదరంగంలో కూచున్నాడు.

మొదటి జాముకి అనుకూలంగానే నడిచింది, కాని నాలుగవ పొద్దువేళ, అక్కడ శ్రోతలొక్కక్కరే వచ్చి కిక్కిరిసిపోతూ ఉన్న సమయంలో ఇక్కడ ఆట బిగిసిపోయింది.

రాజెంత మెళుకువగా ఎత్తులు వేసినా మొదటి ఉజ్జీ గుర్రం పట్టపగ్గాల్లేకుండా చెలరేగిపోసాగింది.

గుర్రం బారి పడకుండా రాజును తప్పించుకుంటూ, బంట్లతో పిడికితాళుకుంటూ, మధ్య మధ్య తన మంత్రితో ఉసికొలుపుతూ అతి కష్టం మీద నిలవ తొక్కుకుని మహారాజు స్వగతంగా నిట్టూర్పు విడిచారప్పటికి. కింద నుంచి "గుర్రం గుర్రం" అంటూ పెద్ద గందరగోళం వినవచ్చింది.

మొదట వసారాలో ఉన్న పరిచారిక "పంచకళ్యాణి కట్టు తాళ్ళు తెంపుకుంది" అని ఆత్రంగా అంది.

తరువాత సన్నిధిని ఉన్న గుబ్బెతలలో నొకతె వెళ్ళి చూసి వచ్చి "పంచకల్యాణి పరవళ్ళు తొక్కేస్తుంది మహాప్రభూ! లచ్చిగాడు పట్టలేక హైరానయిపోతున్నాడండీ!" అని విన్నవించింది.

అక్కడ ఎవరూ లేరా! అని ఆదుర్దా పడుతూ లేచి వెళ్ళి మహరాజు "ఏమ్రిటా ఇది" అని అడిగాడు.

వెంటనే పంచకల్యాణి రాజుకి ఎదురుగా వచ్చి 'కిందకి దిగిర'మ్మన్నట్టు తపవూపుతూ సింహనాదం అన్నంతగా సకిలించింది.

అప్పుడు లచ్చిగాడు చేతులు కట్టుకుని "షికారు బయలుదేరాలి మహాప్రభూ! లేకపోతే గుర్రాన్ని పట్టలేము దేవరా!" అని విన్నవించాడు.

## 2

ఆ గుర్రం అంటే మహరాజుకి ప్రాణం.

పేరుపడ్డ గాయకురాలు రావడం వల్లా, తానున్నూ సంగీతంలో నిధి కనకనూ, ఎందరెందర్నో ఓడించి తోడా వేసుకున్న ఆటకాడెంతో దూరం నుంచి పనికట్టుకుని వచ్చాడు కాబట్టీన్నీ "ఈ ఒక్కనాడూ గుర్రపు స్వారి లేకపోతే యేం" అనుకున్నాడు, కాని మహరాజు కూడా ఒక్కనాడయినా ఆ గుర్రం ఎక్కకుండా ఉండలేదు.

ఇంతేకాక,

మహరాజుకి దాని విషయమై లచ్చిగాడెంత చెబితే అంతే. దానికి మరి తిరుగులేదు.

ఎంచేతనంటే!

తనకోసమే ఆ గుర్రం పుట్టిందనీ, ఆ గుర్రంకోసమే లచ్చిగాడున్నూ పుట్టివున్నాడనీ మహరాజుకి నమ్మకం కుదిరిపోయింది.

దీనికి పెద్ద కారణమే ఉంది.

ఏడాది కిందట లచ్చిగాడు చుట్టపుచూపుగా నొకనాడు పెద్దాపురం వచ్చాడు.

పుట్టిన పాతికేళ్ళకి వాడదే పెద్దాపురం రావడం. వాడి పెత్తల్లి కొడుకు గంగులుగాడే మహరాజు సొంత గుర్రాలను చూస్తూ ఉంటే గుర్రపువాళ్ళకి మొనగాడు.

సహజంగా లచ్చిగాడు కూడా కొంచెమో గొప్పో అశ్వలక్షణాలు తెలిసినవాడే

తరచు గుర్రాలతో మసులుతూ ఉండేవాడే కాని ఏక కాలంలోనూ, ఏక త్రానూ, పెద్దాపురంలో ఉన్నన్ని గుర్రాలను వాడెప్పుడూ చూచి ఉండలేదు.

అంతలేసి గొప్ప గుర్రాలను కూడా చూసి ఉండలేదు. కానీ, వాడికి, గుర్రాలలో మసలడం గంగులు గాడి దగ్గర ఏదో వొకానొక లోపం ఉండినట్టు స్ఫురించింది.

"పెట్టిపుట్టాడు కాని లేకపోతే వీడేమిటి గుర్రపువాళ్ళకి మొనగాడు కావడం ఏమిటి?" అని కూడా అనిపించింది.

అయితే, ఏమనడానికి సాహసించలేకపోయాడు.

అక్కడికి మెల్లగా వెళ్ళి భద్రాశ్వాన్ని దువ్వుతూ "ఏమిరా అన్నయ్యా! చిగుళ్ళు కత్తిరిస్తే కుచ్చులాగుండదూ తోక?" అన్నాడు. కాని వెంటనే గంగులుగాడు "గుడ్డి గుర్రపు తట్లతో మసిలేవాడివి. మహరాజులుంగారెక్కే గుర్రాల సంగతి నీకేం తెలుసురా?" అంటూ ఈసడించి కూచోపెట్టాడు.

ఈ మాట అలుగులాగే గుచ్చుకుంది. కాని ఆ గుర్రాలను విడిచి ఉండలేక మాటలు పెంచడం మానుకున్నాడు లచ్చిగాడు.

## 3

సరిగ్గా ఆ వేళే అయిదు గుర్రాలు వెంట పెట్టుకుని ఒక అరబ్బీ వర్తకుడు పెద్దాపురం ప్రవేశించాడు.

వాటిలో మూడింటిని చూసి పెద్దాపురంలో ఉన్న రౌతులందరూ ముగ్ధులయిపోయారు.

మళ్ళీ ఆ మూడింటిలోనూ ఈ పంచకల్యాణిని చూసి వారు గుటకలే మింగారు.

దీంతో, వర్తకుడి దరఖాస్తుకంటే ముందు ఈ సంగతే మహారాజుకి అందింది.

వర్తకుడు, అలంకరించి యుక్తకాలంలో గుర్రాలను కోటకి తీసుకు వెళ్ళాడు. పదస్థులూ, రాజు బంధువులూ, పిన్నలూ అనేకులూ వచ్చి చూశారు.

వారితో పాటు, వెన్ను విరుచుకుంటూ గంగులు గాడున్నూ వచ్చి చూశాడు గాని వాడి మొగం విడలేదు.

పైగా కొంతసేపటికి పక్కకి తప్పుకుంటూ "మా గుర్రాలకి చాలవు" అని మూతి ముడుచుకున్నాడు వాడు.

అది విని, మనస్సులో చాలా నొచ్చుకుని లచ్చిగాడు "సెబాస్! గుర్రాలంటే ఇవీ. ఇందులోనూ మళ్ళీ అదిగదిగో అది పంచకల్యాణి. రాజా గుర్రం అది. దాని దగ్గర నాకు నౌకరీ దొరికితేనా నా రంగా" అంటూ ఉర్రూతలూగిపోయాడు.

ఇంతలో మహారాజు వచ్చాడు.

అందరూ తప్పుకున్నారు.

గుర్రాలకి అయిదారు గజాల దూరాన నుంచున్నాడు మహారాజు.

వెంటనే పంచకల్యాణి పరమోత్సాహంతో సుతారంగా సకిలిస్తూ నాట్యం చేసింది.

దాన్ని చూసేటప్పటికి మహారాజు మనస్సు కూడా గుబగుబలాడిపోయింది.

ఇలాగ మహారాజుని చూసి గుర్రమూ, గుర్రాన్ని చూసి మహారాజూ ముగ్ధులు కావడం కనిపెట్టి వర్తకుడు ఉప్పొంగి పోయాడు.

వెంటనే అతను "మహాప్రభూ! మా దేశం మొదలు ఇక్కడికి వచేదాకా ఈ క్షణం దాకా దీన్ని అనేకులు చూశారు. కాని ఇది వారికేసి చూడలేదు. ఏలినవారు కళ్ళబడగానే నృత్యం చేసిందిది. దీన్ని బట్టి ఇది యేలిన వారి కోసమే పుట్టినట్టు కనబడుతోంది" అని చెబుతూ దాన్ని మహారాజుకి నజరు పెట్టాడు.

అందుకు మరీ సంతోషించి మహారాజు వర్తకుణ్ణి చాలా గొప్పగా సత్కరించి, మరో రెండూ గుర్రాలు ఖరీదుకి పుచ్చుకున్నాడు.

ఇదంతా చూసేటప్పటికి లచ్చిగాడికి పారవశ్యం కలిగింది.

## 4

ఎప్పుడూ సన్నిధిని ఉండే హితైషులు "వెంటనే ఒకమాటు స్వారి వెళ్ళడం మంచి"దని చెప్పారు.

ఈ సమయం దాటితే మరి నెలా పది రోజులదాకా మంచి ముహూర్తంలేదని ఆస్థాన సిద్దాంతి కూడా విన్నవించాడు.

"ఈ గుర్రాన్ని ఎక్కడానికి తమరే మొదటివారు మహాప్రభూ! కనక ఇప్పుడే ఒకమారు స్వారీ వెడితే చూసి నేను కూడా సంతోషిస్తాను దేవరా" అంటూ వర్తకుడున్నూ చాలా చాలా ప్రార్థించాడు.

తన కోరిక కూడా అదే కాగా "సిద్ధం చెయ్యరా" అని గంగులు గాడికి చెప్పి, దుస్తులు మార్చుకోడానికి మహారాజు లోపలికి వెళ్ళాడు."

వెంటనే గంగులుగాడు కళ్ళెం పుచ్చుకుని బయలుదేరాడు.

జీను పట్టుకుని వాడి వెనుక మరొక గుర్రపువాడు బయలుదేరాడు.

తక్కిన అలంకారాలు పుచ్చుకుని మరికొందరున్నూ వెంబడించారు.

కాని ఆ గుర్రం ఒక్కణ్ణీ చేరనివ్వలేదు.

మొదట అది గంగులుగాడి గుండెలు పగిలేటట్టు ముట్టెతో విసిరి కొట్టింది.

తరువాత ఎగిరి మరిద్దర్ని తన్నింది.

చివరికి, తోక ఝాడించి మరొకడికి దిమ్మెక్కించింది.

ఈ పెంకితనం చూసి మొదట రిచ్చపడి, తరువాత సిగ్గుపడి, చివరికి దిగాలుపడి ఎలాగయినా తన మర్యాద కాపాడుకోలని బుజ్జగిస్తూ వర్తకుడున్నూ ప్రయత్నించాడు, కాని అతని సత్కారం అతనికి ముట్టింది కనుక అతగాణ్ణి కూడా అది విదిలించి కొట్టింది.

అందరూ ఖిన్నులయిపోయారు.

## 5

ప్రభువు మళ్ళీ వచ్చేటప్పటికిదీ స్థితి.

ఎప్పుడెప్పుడనుకుంటూ మనోవేగంతో వచ్చిన ప్రభువు వచ్చిన గుర్రం వచ్చినట్లే ఉండడం చూసి "ఏమిరా?" అన్నట్టు గంగులుగాడికేసి కొంచెం కరుగ్గా చూశాడు.

దాని మీద గజగజ వణికిపోతూ జరిగినదంతా చెప్పి గుర్రపు వాళ్ళు పడి పడి దణ్ణాలు పెట్టారు.

ఇదంతా చూస్తూ లోపల్లోపల నవ్వుకుంటూ నిశ్చలంగా నుంచుని ఉన్నాడు లచ్చిగాడు.

మహారాజు వాడి నైలక్షణ్యం గుర్తించాడు. కాని కొత్తవాడు కావడం వల్ల పలకరించలేదు. వాడుకూడా మహారాజుతో సాహసించి మాట్టడలేక మిడుతూ మిడుతూ చూసి ఊరుకున్నాడు.

గంగులుగాడి కిది పౌరుషం కెళ్ళించింది.

తక్కినవాళ్ళు కూడా లచ్చిగాడి కేసి గుర్రుగా చూసి, "ఊరుకుంటే ఎలాగా?" అన్నట్టు గంగులుగాడికేసి చూశారు.

అందరూ కలిసి మళ్ళీ మళ్ళీ ప్రయత్నించి, తన్నులు తినడం తరవాయిగా, మళ్ళీ విఫలయినారు.

అది చూసి లచ్చిగాడు అలాగే నుంచుని చిరునవ్వు నవ్వాడు.

అది మహారాజు కళ్ళబడింది.

ఆ చిరునవ్వులో అహమిక ఉండడం గుర్తించి మహారాజు "ఎవర్రా నువ్వు" అని గంభీరంగా చూస్తూ అడిగాడు.

"నేను గంగులుగాడి పింతల్లి కొడుకుని బాబయ్యా! నా పేరు లచ్చిగాడండి" అని వంగి దణ్ణం పెడుతూ బదులు చెప్పాడు వాడు.

"ఏ ఊరు నీది?"

"పుట్టకొండ మహాప్రభూ"

"ఎందుకురా నవ్వుకుంటున్నావూ?"

"కారణం తరువాత మనవి చేసుకోవడానికి ముందు గుర్రానికి కళ్ళెం పెట్టి జీను వెయ్యడానికి సెలవిప్పించండి దేవరా."

ఇది విని గుర్రపువాళ్ళందరూ ఏక కాలంలో "వాడి వల్ల ఏమవుతుంది మహాప్రభూ?" అని తమ అభిజాత్యం ఒలకపోసుకున్నారు.

దాని మీద మళ్ళీ చిరునవ్వు కనపరిచాడు లచ్చిగాడు.

మహారాజుకి ఆ చిరునవ్వులో చాలా ఆత్మవిశ్వాసం కనపడింది.

"ఎందుకు సెలవివ్వకూడదూ?" అనిన్నీ అనిపించింది. అయినా తొందర పడక "ఎంతో అనుభవం ఉన్న అంత మందిని విసిరికొడుతోందే అది, నీ ధైర్యం ఏమిటిరా?" అని అడిగాడు.

"నన్ను చేరదీస్తుంది బాబయ్యా"

"కారణం"

"చెప్పలేనండి. కాని నిదర్శనం చూపించుకుంటాను, సెలవు దయచేయించండి."

"చూపించలేకపోతే?"

"తల కొట్టి వెయ్యవచ్చునండీ"

దీని మీద వాడివల్ల ఎంతో అపరాధం జరిగిపోయినట్టు ఆత్రపడుతూ "నీకు బతకాలని లేదుట్రా?" అని ఉరుముతూ లచ్చిగాణ్ణి కసిరి, "వాడు కళ్ళు తెరవని పసిరికుంక మహాప్రభూ! తల్లికీ, తండ్రికీ ఒక్కడే బిడ్డడండి. వాడి మాటలు లెక్క చేయక కరుణించి విడిచి పెట్టండి దేవరా" అని మహారాజుని ప్రార్థించాడు గంగులుగాడు.

"అయితే మరి చెయ్యవలసిందేమిట్రా?" అని అడిగాడు మహారాజు.

"ఇది పెంకి గుర్రం దేవరా! వారం దినాలు తిండీ తిప్పలూ మానేస్తే తరువాత చెప్పినట్టల్లా వింటుందండి" అని జవాబు చెబుతూ గంగులుగాడు మీసాల మీదకి చెయ్యిపోనిచ్చుకున్నాడు.

దీనికి మహారాజు మనస్సు చివుక్కుమంది.

అందుకు సాయం "రామరామా" అంటూ వొకమాటు చెవులు మూసుకుని, లచ్చిగాడు "అది జాతయిన గుర్రం మహాప్రభూ! దాన్ని పస్తు పెట్టడం జయకరం కాదండి. దాని సంగతి వీళ్ళు తెలుసుకోలేకపోయారండి. అది గంగిగోవు దేవరా! నీతయినవాణ్ణని కాని అడ్డమైన వాళ్ళనీ చేరనివ్వదండి అది" అని గుర్రానికి దణ్ణం పెడుతూ చెప్పాడు లచ్చిగాడు.

ఈ మాట మహారాజు నల్ల గుండెలో నాటుకుంది. అచ్చిగాడి సంగతి అలా ఉండగా తన మాట తాను ఆ స్వారీ చెయ్యలేకపోతే? అసలు ఆరోహణమే చెయ్యలేకపోతే?

మహారాజు హృదయం కుతకుతలాడిపోయింది. మనస్సు గజిబిజి అయిపోయింది.

అప్రయత్నంగా నాలుగు వేపులా చూశాడు.

అందరి కళ్ళూ తన మీదే ఉన్నాయి.

ఆ కళ్ళలో 'నీతయిన వాళ్ళెవరెవరో ఇప్పుడు తెలిసిపోతుంది' అన్న భావం ఉన్నట్టున్న స్ఫురించింది.

దాంతో ఉద్రిక్తుడయినాడు.

వెంటనే "ఏదీ నిదర్శనం చూపించూ" అని లచ్చిగాణ్ణి చురుగా చూశాడు.

ప్రభువు చూపుల్లో 'జ్ఞాపకం ఉందా? తల ఎగిరిపోతుంది సుమా' అన్న ముదలకింపు ఉండడం లచ్చిగాడికి స్పష్టంగా కనబడింది.

అయినా అధైర్యం కాక సాహసమే కలిగింది వాడికి.

శరీరం పొంగి పోయింది.

నూత్నావేశం కూడా కలిగింది.

దాంతో పరవశుడై ముందు మహారాజు ఆజ్ఞ వంగి దోసిలి వొగ్గి అందుకుని తరువాత పదడుగులు ముందుకు వేసి, పాగా తీసి నడుముకి చుట్టుకుని గుర్రం కేసి చూస్తూ నేల అంటి కళ్ళకద్దుకుని మళ్ళీ ముందుకి అడుగు వేశాడు.

వెంటనే ప్రసన్నంగా చూస్తూ గుర్రంవాడికభిముఖం అయింది.

రాజు చకితుడైనాడు.

గుర్రపు వాళ్ళు పిడుగు పడ్డట్టయిపోయారు.

తక్కిన వారందరూ విస్మితులైయినారు.

కళ్ళు చికిలించుకుని మళ్ళీ అందరూ చూసేటప్పటికి లచ్చిగాడి భుజం మీద తన మెడ ఉంచుకుని గుర్రం ప్రీతి నెరుపుతోంది.

"బాబా! నా బాబా! దేవలోకం నుంచి వచ్చావు నువ్వు. భూలోక దేవేంద్రులవారి దివాణంలో పడ్డావు. నీకేం లోటురా బాబా" అంటూ దాని మెడ తట్టుతున్నాడు లచ్చిగాడు.

గుర్రపు వాళ్ళందరూ తలకాయలు పొట్టల్లో పెట్టుకున్నారు.

వర్తకుడు మొదట కొంచెం స్థబ్ధుడై, తరువాత సంతుష్టుడై మహారాజుకి సలాం మీద సలాం చేసి "అంతా ఇంద్రజాలంగా ఉంది మహాప్రభూ! ఈ గుర్రం కోసమే ఈ పెద్ద మనిషి పుట్టినట్టు కనపడుతోంది. ఈ అనుబంధం ఆశ్చర్యకరంగా ఉంది. నా జన్మ ధన్యం అయింది దేవరా" అంటూ పొంగిపోయాడు.

ఈ సందుబాట్లో, లచ్చిగాడూ క్షణంలో అలంకారాలన్ని తొడిగి, కళ్ళెం పెట్టి, జీను కట్టి గుర్రాన్ని మహారాజు సన్నిధికి విడిచి పెట్టి, అందర్నీ తప్పుకోమన్నట్లు ఒక్కమాటు దర్జాగా చెయ్యి తలఊపి, "ఒక్కమారు దేవుణ్ణి ప్రార్థించుకుని, బాబాని బుజ్జగించి ఎక్కండి దేవరా" అని విన్నవించాడు.

మహారాజు ఆనంద ముగ్ధుడయిపోయాడు. వెంటనే లచ్చిగాడు చెప్పినట్టుచేసి ఒక్క విసురున గుర్రం ఎక్కాడు. గుర్రం ఎగిరిపోయింది.

## 6

అది మొదలు

ఏదన్నా మానవచ్చుగాని, అనుదినమూ గుర్రపుస్వారి మానడానికి వీలులేదు.

మహారాజయినా మానలేడు.

గుర్రం ఎక్కగానే ప్రభువు ఏదో దైవిక శక్తి ఆవహించినట్టవుతాడు. ప్రాభవం పెరిగిపోయింది. వయస్సు కొంచెం మళ్ళినా, మళ్ళీ నవయౌవనం అంకురించినట్టయింది

ఇదిలా ఉండగా -

మహారాజుకి, లచ్చిగాడి మీద అమిత పుత్రవాత్సల్యం కలిగిపోయింది.

వాడు గుర్రపు వాళ్ళందరికీ మొనగాడు అయిపోయాడు.

వాడిలో కూడా చాలా మార్పు, చాలా విశిష్టతా ఏర్పడింది.

షష్టీగడియలూ వాడికి గుర్రంతోనే సరిపోతుంది. గుర్రం కూడా వాడి కను సన్నల్లోనే మెలుగుతుంది.

గుర్రమూ, వాడూ ఒకచోటున్నంతసేపూ ఏదో ముచ్చటలాడుకుంటున్నట్టే ఉంటారు.

ఆడుకుంటున్నట్టూ ఉంటారు.

మాలీషు చేస్తూ, ఆగి ఆగి కువ కువలాడినట్టు వాడేమిటేమిటో చెబుతూ ఉంటాడు.

అందులో గుర్రానికి చక్కని ముక్తాయింపులు కనబడతాయి.

గుర్రమున్నూ మహానందంతో సకిలిస్తూనే ఉంటుంది.

అందులో లచ్చిగాడికి స్వర కల్పన కనబడుతుంది. దాంతో ఉభయులకూ పారవశ్యం కలిగినట్టుంటూ ఉంటుంది.

రోజల్లా ఇల్లా మల్లెపూల తెప్పమీద తేలిపోతూ ఉండగా సాయంత్రం స్వారి.

సరిగా ఆ సమయం సమీపించేటప్పటికి గుర్రానికి నరాలు పొంగుతున్నట్టు కనబడతాయి.

లచ్చిగాడికి శరీరంలో మెరుపు తీగలు పాకిపోతున్నట్టుంటాయి.

అంతా సిద్ధమయిందని కబురు వచ్చేటప్పటికి మహారాజు ఎలా వున్నవాడలా లేచి బయలుదేరతాడు.

ముగ్గురికీ, చివరికి, క్షణంలో ఒక్కమాటు భూప్రదిక్షిణం చేసి వచ్చినట్టనిపిస్తుంది.

అప్పటికీ దివ్య సుఖానుభూతీ, ఆనంద పారవశ్యమూ మేళవించగా ముగ్గురికీ హృదయాలు తేరుకుంటాయి.

కాగా, లచ్చిగాడు గుర్రం విషయమై తనకి తోచింది తోచినట్టు చెప్పేస్తూ ఉంటాడు.

వినీ వినడంతోనే మహారాజు లచ్చిగాడు చెప్పినట్టల్లా చేసేస్తూ ఉంటాడు.

ఆవేళ కూడా అలాగే చేశాడు.

గుర్రం ఇంగితం తెలిశాక, లచ్చిగాడి పిలుపుకూడా అందాక మహారాజు ఒక్క క్షణమయినా అక్కడ ఉండలేకపోయాడు.

ఎప్పుడూ లేంది దుస్తులు మార్చుకోవడం క్షణంలో అయిపోయింది.

అవలగ్న బంధంలో కట్లారి ఉంచడానికి వచ్చిన యువతితో "చదరంగం ఇక రేపే" అని శిరస్సున పాగా అమర్చడానికి వచ్చిన గుబ్బెరతో "సంగీత కచేరీ భోజనాలయినాకే" అని పాదాలకి పావుూసులు తొడగడానికి వచ్చిన ముద్దరాలితో "అభ్యంగానికి సిద్ధం చేయించు" అని చెప్పి మహారాజు కిందకి వచ్చేటప్పటికి అలంకృతమై పంచకల్యాణి సర్వసిద్ధంగా ఉంది.

"కొంచెం ఆలస్యం అయినందుకు, ఇవాళ గుర్రం మేఘాల మీద ఎగిరిపోతుంది దేవరా! కనుక మొదట కోట చుట్టూరా తిరిగి ఉద్ధుతం తగ్గాక, అప్పుడు పాండవుల మెట్టకేసి బయలుదేరండి మహాప్రభూ" అని విన్నవించుకుని లచ్చిగాడు పది అంగలు కూడా వేశాడు.

## 7

పాండవుల మెట్ట దాటి అరకోసుదూరం వెడల్పున కాలువ. దాని నిండా ఎప్పుడూ ఏనుగీత నీరు. అది తిరగేసుకు వెళ్ళాలంటే ఎగువకి, దిగువకీ కూడా రెండేసి కోసులు వెళ్ళాలి.

మొదటినాడు "ఏమిటి చెయ్యడం" అని మహారాజు ఆలోచనలో పడగా "ఫరవాలేదు, గుర్రం దాటేస్తుంది దేవరా" అని లచ్చిగాడు ధైర్యం చెప్పాడు.

ప్రయత్నించగా , గుర్రం వెళ్ళేటప్పుడూ, వచ్చేటప్పుడు కూడా అతి సునాయాసంగా దాటేసింది.

మహారాజుకి చాలా ఆనందం కలిగింది.

అది చాలా ముచ్చటగా కూడా కనపడింది.

అంచేత ప్రతి దినమూ, గుర్రపు స్వారీ కదే దారి.

కానీ ఆ వేళ, కాలవ ఇంక వంద గజాలలో ఉందనగా వేగం హెచ్చించిన్నీ గట్టుమీదకి వచ్చేటప్పటికీ గుర్రం హఠాత్తుగా ఆగిపోయింది.

మహారాజు నిర్విణ్ణుడయిపోయాడు.

"ఏం చెప్మా?" అనుకుంటూ అలాగా ఇలాగా పారజూసిన్నీ కారణం కనిపెట్టలేక, అయినా వెనక్కి మళ్ళడానికిష్టపడక, మళ్ళీ మళ్ళీ ప్రయత్నించాడు.

గుర్రం కూడా కసిగానే ఉండినట్టు కనపడింది. కాని దాటదు. ఎంత హెచ్చరించినా ఉండాయించదు.

ఈ వెనక్కీ ముందుకీ వెళ్ళడాలు అంతదూరం నుంచే చూసి, కంగారు పడుతూ లచ్చిగాడు వచ్చేటప్పటికి ప్రయత్నం మానుకుని మహారాజు అలాగే ఉండిపోయాడు.

"ఏం బాబయ్యా!" అంటూ ఆత్రంగా అడిగాడు లచ్చిగాడు.

"గుర్రం దాటటం లేదురా"

"........................"

"ఉడాయించటమే మానేసిందిర"

"................................"

"అవతలి గట్టున కాని, కాలవలో కాని ఏవయినా భయకారణం ఉందేమో చూడు"

లచ్చిగాడు బాగా పరకాయించాడు కానీ ఏమీ కనపడలేదు. తల గోక్కుంటూ, ముందుకి వెళ్ళినుంచుని కళ్ళలోకి గంభీరంగా చూశాడు వాడు.

గుర్రం తల విసిరింది.

ఏదో పొరపాటు జరిగినట్టు తోచింది కాని విడిపోలేదు. ఏర్పడించుకోలేక "మళ్ళీ నా ఎదుట ఒకమాటురికించండి బాబయ్యా", అన్నాడు వాడు.

మహారాజు చాలా కసిగా ఉరికించాడు.

కాని అంతా వ్యర్థం.

గుర్రం సరిగ్గా పరిగెత్తనే లేదు.

మహారాజు మనస్సు చెడిపోయింది.

లచ్చిగాడికి గుండెలు కొట్టుకుంటున్నాయి. దానిమీద "ఏం బాబా లచ్చిగాడికి ఇవాళతో భూమ్మీద నూకలయిపోయాయా?" అంటూ ఒక్క క్షణం కళవళపడి అయినా ఉత్తర క్షణంలో ప్రయత్నించి నిలవరించుకుని మోకాళ్ళ మీద చేతులానుకుని వంగుని చూసి "పాగా వొరిగినట్టుంది చూడండి బాబయ్యా!" అంటూ పక్కకి తప్పుకున్నాడు వాడు. చూడగా అలాగే ఉంది.

అందుకాశ్చర్యపడుతూ మహారాజు పాగా బాగా సర్దుకున్నాడు.

అంతే

వెంటనే గుర్రం తనకితానే వెనక్కి వెళ్ళి గుండెలు దూసుకుపోయేటట్టు చూస్తూ ఒక్క పరుగున వచ్చి, ఒక్క వూపున కాలవేకాక కాలువ గట్టుకూడా దాటేసింది.

ఇది జరిగిందీ, విన్నదీని, రచన మట్టుకు నాది.

✡✡✡